క్లుప్తంగా

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు కోడుమూరు విద్యార్థి



విద్యార్థి జగన్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కోడుమూరు రూరల్ : స్థానిక జీవీఆర్ బాలుర హైస్కూల్‌కు చెందిన 9వతరగతి విద్యార్థి జగన్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక య్యాడు. కర్నూలులో జరిగిన అండర్–14,17 వాలీబాల్ పోటీల్లో విద్యార్థి జగన్ అద్భుతమైన ప్రతిభ కనబర్చడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్లు హెచ్‌ఎం తైమూర్‌బాషా తెలిపారు. ఈ మేరకు శనివారం విద్యార్థి జగనన్‌తోపాటు వ్యాయామ ఉపాధ్యాయుడు సురేంద్రనాయుడుని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి



గూడూరులో వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ తిమ్మయ్య

కోడుమూరు రూరల్ : ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని గూడూరు ఎస్‌ఐ తిమ్మయ్య సూచించారు. శనివారం రాత్రి ఎస్‌ఐ తిమ్మయ్య తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు వాహనానికి సంబంధించి పత్రాలతో పాటు, డ్రైవింగ్ లైసెన్ తప్పక కలిగివుండాలన్నారు. నిబంధనలు అతిక్రమించి ప్రవర్తిస్తే చలానాలు విధిస్తామని ఎస్‌ఐ హెచ్చరించారు. సరియైన పత్రాలు లేని ఎనిమిదిమంది వాహనదారులకు ఎస్‌ఐ చలానా విధించారు.

పిక్కలను పీకేస్తున్నాయ్..



గడివేములలో గుంపుగా కుక్కలు

గడివేముల: కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. గుంపులుగా తిరుగుతూ జనంపై దాడికి దిగుతున్నాయి. బాటసారుల పిక్కలను పీకేస్తున్నాయి. దీంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. మండల కేంద్రమైన గడివేములతో పాటు పలు గ్రామాల్లో వీధి కుక్కల సంచారం ఎక్కువయ్యింది. కుక్కకాటు బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. వీధి కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ ఓంకార్‌యాదవ్

ఓర్వకల్లు: చదువుకోని మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓ ఓంకార్‌యాదవ్ అన్నారు. శనివారం స్థానిక పొదుపు భవనంలో వయోజన విద్య కార్యక్రమంలో భాగంగా ఉల్లాస్(యుఎల్ఎల్ఏఎస్) అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లరినింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పొదుపు సంఘాల మహిళలకు చదువు చాలా అవసరమని తెలిపారు. సమావేశంలో వయోజన విద్యా సూపర్ వైజర్ శ్రీనివాసులు, వెలుగు సిబ్బంది, వీఓఏలు పాల్గొన్నారు.

పేద పిల్లలకు నిత్యావసరాల పంపిణీ



నిత్యావసర కిట్లను పంపిణీ చేస్తున్న డాక్టర్ నౌషద్

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని వడ్డేగేరిలోని కేవీ గార్డెన్‌లో ఉన్న నగర పాలక ప్రాథమికోన్నత పాఠశాలలో పేద విద్యార్థులకు ఉచితంగా నిత్యావసర కిట్లను ఇంటర్నేషనల్ చారిటీ ఎయిడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అందజేశారు. ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ ఎండీ నౌషద్ చేతుల మీదుగా 45 మంది పిల్లలకు ఈ కిట్లు పంపిణీ చేశారు. వీటితో పాటు స్పోర్ట్స్ కిట్లను సైతం పిల్లలకు అందించారు. తద్వారా పిల్లలకు ఆరోగ్యంతో పాటు శారీరక ఆరోగ్యం కూడా వస్తుందన్నారు. పిల్లలు ప్రతిరోజూ నోటిని శుభ్రంగా ఉంచుకోవాలని, నోటి శుభ్రతతో ఆరోగ్యం దాగి ఉందని డాక్టర్ నౌషద్ సూచించారు. కార్యక్రమంలో ఐవైడీఎఫ్ డైరెక్టర్ మార్కో, పాఠశాల హెడ్ మాస్టర్ కస్తూరి, ఉపాధ్యాయులు మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యం!

- మూలనపడిన కియోస్క్ యంత్రాలు
- అధికారుల తీరును తప్పుపడుతున్న రైతులు
- సకాలంలో అందని ఎరువులు



గడివేముల ఏఓ కార్యాలయంలో మూలపెట్టిన కియోస్క్ యంత్రాలు



గతంలో కియోస్క్ మిషన్‌లో రైతులు ఎరువులను బుక్ చేసుకుంటున్న దృశ్యం (ఫైల్)

గడివేముల: టీడీపీ కూటమి ప్రభుత్వం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ఉద్దేశపూర్వకంగా తొలగిస్తున్నారని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం రూ. లక్షలు వెచ్చించి రైతుల సౌకర్యార్థం తీసుకొచ్చిన కియోస్క్ యంతాలను మూలనపడేసిన తీరు ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యం. ప్రజా ధనాన్ని వృథా చేస్తున్నారనే గ్రామీణులు విమర్శలు గుప్పిస్తున్నారు. వాస్తవానికి నాడు రైతులకు ఎంతో మేలు చేకూర్చిన కియోస్క్ యంత్రాలు నేడు నిరుపయోగంగా మారాయి. రైతులు తమ పంటలకు అవసరమైన విత్తనాలు, ఎరువులను నేరుగా వారి గ్రామం నుంచే పొందేందుకు ఈ ఆధునిక యంత్రాలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతీ సచివాలయానికి అనుబంధంగా రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసింది. ఈ మేరకు గడివేముల మండలంలోని 14 రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల్లో డిజిటల్ విధానంలో నూతన ఆవిష్కరణలతో రైతులకు మంచి సేవలు అందాయి. ఈ యంత్రాల్లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు వ్యవసాయ యంత్రాలు, మార్కెట్ ధరలు, మార్కెట్‌ల వివరాలు, తదితర అవసరమైన అన్ని సేవలను ఈ డిజిటల్ కియోస్క్ యంత్రం ద్వారా తెలుసుకునే వీలుండేది. కచ్చితమైన సమాచారం, ఫలితాలతో నాడు రైతులకు వ్యవసాయ శాఖ అన్నివిధాలా అవగాహన కల్పించింది. వాతవరణ సమాచారం, మార్పులు, ఏ సమయంలో ఏ పంటలు వేయాలన్న సమగ్ర సమాచారాన్ని ఇందులో పొందుపరిచి కియోస్క్ యంత్రాలు నేడు నిరుపయోగంగా మూలనపడేశారు. దీంతో ప్రభుత్వంతోపాటు అధికారులు తీరును రైతులు తప్పుపడుతున్నారు.

అసంతృప్తి వ్యక్తం చేస్తున్న రైతులు

వ్యవసాయాన్ని టీడీపీ కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే పెట్టుబడి సాయం ఏకంగా రూ. 20 వేలు అందజేస్తామంటూ హామీలు గుప్పించిన కూటమి నేతలు ఆ ఊసే ఎత్తని తీరును తప్పుపడుతున్నారు రైతులు. రైతుభరోసా పేరును అన్నదాత సుఖీభవా అంటూ మార్చేరే తప్పా ఏ మాత్రం భరోసా కల్పించడం లేదని విమర్శలుగుప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో కియోస్క్ యంత్రాలను మూలనపడేసిన తీరును తప్పుపడుతున్నారు రైతులు. గతంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు పూర్తి స్థాయిలో పంపిణీ చేసేవారు. ప్రస్తుతం మొక్కుబడిగా రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువుల అందిస్తున్నారు. ప్రైవేట్ డీలర్ల వద్ద అధిక ధరలకు ఎరువుల కొనుగోలు చేస్తున్న పరిస్థితి నెలకొంది. ఖరీఫ్ సీజన్ ఇప్పటికే పూర్తైంది. రబీ సీజన్‌లోనైనా కియోస్క్ యంత్రాల వినియోగంలోకి తేవాలని రైతులు కోరుతున్నారు.

ఎరువులు అందించాలి



రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులు పూర్తి స్థాయిలో అందించాలి. ఖరీఫ్ లో రైతులకు అవసరమైన ఎరువులు పూర్తి స్థాయిలో కూటమి ప్రభుత్వం అందించలేకపోయింది. రబీ సీజన్ లోనైనా అందించేందుకు అధికారులు కృషి చేయాలి. ప్రైవేట్ డీలర్ల వద్ద అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తుంది. గత వైఎస్సార్ ప్రభుత్వంలాగానే రైతులకు అవసరమైన అన్ని ఎరువులు అందించాలి.

–తలారీ బాలచెన్ని, రైతు,గడివేముల

డిజిటల్ విధానం అమలు చేయాలి



నాడు రైతు భరోసా కేంద్రాలలో డిజిటల్ విధానంలో నూతన ఆవిష్కరణలతో కియోస్క్ యంత్రాల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించేవారు. వ్యవసాయ యంత్రాలు, పంటల ఉత్పత్తి, మార్కెట్ వివరాలు తెలిసేవి. అప్పటిలాగే ఇప్పుడు కూడా రైతులకు డిజిటల్ సేవలు అందించాలి. –శివ,గడివేముల

గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ వెంకటేష్ నాయక్

కోడుమూరు రూరల్ : రీసర్వేలో నెలకొన్న భూసమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వెంకటేష్ నాయక్ సూచించారు. శనివారం మండలంలోని వర్కూరులో తహసీల్దార్ గ్రామ సభ నిర్వహించి రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ క్రిష్ణమూర్తి, మండల సర్వేయర్ సునీల్, వీఆర్వోలు మధుసూదన్, నారాయణ, ఎల్లప్ప, శేఖన్న, సురేష్, సర్వేయర్లు వేణుగోపాల్, మాదన్న తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో ...

గూడూరు మండలంలోని జూలకల్లులో శనివారం తహసీల్దార్ రామాంజినేయులు గ్రామ సభ నిర్వహించి రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు. కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ లోకేశ్వరరెడ్డి, మండల సర్వేయర్ బాలునాయక్, విలేజ్ సర్వేయర్లు జాకీర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అనుమతుల్లేని మందులు విక్రయిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్ : వ్యవసాయ శాఖ అనుమతి లేని మందులు, ఎరువులను విక్రయించే డీలర్లపై చర్యలు తప్పవని ఏఓ రవిప్రకాష్ హెచ్చరించారు. శనివారం కోడుమూరులోని ఎరువులు, పురుగు మందుల దుకాణాను ఏఓ తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్లు, రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం స్థానిక రైతు సేవా కేంద్రంలో దుకాణదారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరలకంటే ఎక్కువ రేట్లకు అమ్మినా, రైతులు అడిగిన వాటిని ఇవ్వకుండా వ్యవహారించినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు కొన్న ప్రతి వాటికి రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలని ఏఓ సూచించారు.

వైన్‌షాపును శివారుకు తరలించాలి



చైర్మన్, కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మెయిన్‌రోడ్డు కాలనీలవాసులు

కోడుమూరు రూరల్ : మండల కేంద్రం గూడూరు మెయిన్ రోడ్డులో నివాసగృహాల మధ్య ఏర్పాటు చేసిన మణికంఠ వైన్స్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ శనివారం మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, కమిషనర్ నాగరాజుకు స్థానికులు వినతి పత్రం అందజేశారు. గృహాలు, ప్రజలతో రద్దీగా ఉండే ప్రాంతంలో మణికంఠ వైన్స్ పేరుతో మద్యం దుకాణం ఏర్పాటు చేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆయా కాలనీవాసులు కమిషనర్‌కు విన్నవించారు. మహిళలు, పిల్లలు ఇళ్లలో నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొందని వారు వాపోయారు. అధికారులు స్పందించి వైన్‌షాపును తొలగించకుంటే ఆందోళనలు చేపడుతామని స్థానికులు హెచ్చరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు పీఎస్ అస్లామ్, లక్ష్మన్న, కౌన్సిలర్లు, స్థానిక కాలనీవాసులు మల్లికార్జున, సత్యనారాయణ, ప్రసన్నకుమార్, వీరయ్య, జగదీష్, ఖలీల్, అరవింద, రమేష్, ఇబ్రహీం పాల్గొన్నారు.

రైతులకు రూ.20 వేలు పెట్టుబడిసాయం ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20వేలు ఇవ్వాలని ఏపీ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం డిమాండ్ చేశారు. శనివారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..పెట్టుబడి సాయంగా ఇస్తామన్న రూ.20 వేల నగదును ఖరీఫ్ సీజన్ ముగిసిన ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. రబీ సీజన్ ప్రారంభమైనా పెట్టుబడి నిధిపై నోరు మెదపకపోవడం దారుణమైన విషయమన్నారు. రబీ రైతులకు బీమా మొత్తాన్ని కూడా టీడీపీ కూటమి ప్రభుత్వం ఎగ్గొట్టిందన్నారు. జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతిని రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ఎకరాకు రూ.25 వేలను పరిహారంగా ఇవ్వాలని కోరారు. ధరలు పడిపోయిన పత్తి, ఉల్లి, కొర్ర రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు డి. శ్రీనివాసరావు, సురేంద్ర యాదవ్, రామాంజనేయులు, కృష్ణానాయక్, బాషా పాల్గొన్నారు.

సీఎంఈలతో మరింత విజ్ఞానం



జోనల్ సీఎంఈ కార్యక్రమంలో పాల్గొన్న ఫోరెన్సిక్ వైద్యుల బృందం

కర్నూలు(హాస్పిటల్): వైద్యకళాశాలల్లో నిర్వహించే నిరంతర వైద్య విజ్ఞాన సదస్సులు వైద్యులు, వైద్య విద్యార్థుల్లో మరింత జ్ఞానాన్ని పెంచుతాయని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. చిట్టినరసమ్మ చెప్పారు. డాక్టర్ ఎన్‌టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ నిబంధనల ప్రకారం శనివారం కర్నూలు మెడికల్ కాలేజీలో ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో 'విష, మత్తు పదార్థాలు, సమాజంపై వాటి దుష్ప్రభావాలు, ఫోరెన్సిక్ నిపుణుల పాత్ర' అనే అంశంపై సీఎంఈ నిర్వహించారు. సదస్సును ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ ప్రారంభించి ప్రసంగించారు. హెల్త్ యూనివర్సిటీ ఆదేశాల మేరకు కళాశాలలోని అన్ని విభాగాల ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా జోనల్ సీఎంఈలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి, కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పృథ్వీ వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్‌లు డాక్టర్ సాయిసుధీర్, డాక్టర్ రేణుకాదేవి, డాక్టర్ హరిచరణ్, డాక్టర్ విజయానందబాబు, జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.లక్ష్మీబాయి, ఎమర్జెన్సీ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి. సుబ్రహ్మణ్యం, ఫోరెన్సిక్ నిపుణులు జి.వీరనాగిరెడ్డి, ఆర్. శంకర్, పి.బ్రహ్మాజి మాస్టర్, ఎం.బాబు, జి. మహేష్, జడ్. శశికాంత్, ఎం.శ్రీనివాసనాయక్, ప్రభాకర్, జగదీష్‌నాయక్, జి.దినేష్ పాల్గొన్నారు.

స్పోర్ట్స్

తైక్వాండో క్రీడాకారుడికి అభినందనలు



మెడల్స్ సాధించిన క్రీడాకారుడిని అబినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే గఫూర్

కర్నూలు (టౌన్): ఈనెల 6 నుండి 8 వరకు తిరుపతి పట్టణంలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 బాలుర విభాగంలో ప్రణవ్ శ్రీరామ్ ప్రతిభ చాటారు. ఈనేపథ్యంలో ఆ విద్యార్థిని మాజీ ఎమ్మెల్యే, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్ అభినందించారు. శనివారం స్థానిక వీకర్‌సెక్షన్ కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ భవిష్యత్తులో జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. అనంతరం మెడల్స్ , సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో తైక్వాండో కోచ్ జి.షబ్బీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

షూటింగ్‌బాల్ పోటీల్లో రాణించాలి



క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేసిన న్యాయవాది శ్రీధర్ రెడ్డి

కర్నూలు (టౌన్) : ఈనెల 20, 21 తేదీల్లో అనంతపురం జిల్లాలో జరిగే 43 వ రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు రాణించాలని స్పోర్ట్స్ ప్రమోటర్, న్యాయవాది శ్రీధర్ రెడ్డి అన్నారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులను శనివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఆయన దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లుగా తన వంతుగా క్రీడల అభివృద్ధికి పాటుపడుతున్నట్లు చెప్పారు. విద్యార్థులు చదువులకే పరిమితం కాకుండా క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇందుకు తన వంతు సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా షూటింగ్ బాల్ సంఘం కార్యదర్శి బి. ఈశ్వర్ నాయుడు, క్రీడా సంఘాల ప్రతినిధులు, స్టేడియం సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

గడివేముల: పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని కే బొల్లవరం, గడిగరేవుల గ్రామాలలో రోడ్ల నిర్మాణానికి ప్రజాప్రతినిధులు, అధికారులు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు వంగాల శ్రీనివాస రెడ్డి, పంచాయతీ రాజ్ ఏఈ భాస్కర్, ఏపీఓ వెంకటరమణ, ఏపీఎం నాగరాజు, ఈఓపీఆర్డీ మహిధర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాగేష్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: జాతీయ ఉపాధి హామి నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శనివారం అధికారులు భూమి పూజలు నిర్వహించారు. నన్నూరు, పూడిచెర్ల, కేతవరం గ్రామాలలో పనులు ప్రారంభించారు. కార్యక్రమానికి ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏపీఓ కుమార్‌సాయినాథ్, పిఆర్ ఏఈ సురేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, సర్పంచులు బ్రహ్మయ్య, గోవర్ధన్ పాల్గొన్నారు.

కల్లూరు: పల్లె పండగ వారోత్సవల్లో భాగంగా ఎ.గోకులపాడు, సల్కాపురం, నెరవాడ గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి అధికారులు, ప్రజాప్రతినిధులు భూమి పూజ చేశారు. కార్యక్రమాలలో ఈఓఆర్డీ నాగేష్, ఎ.గోకులపాడు సర్పంచ్ గిడ్డమ్మ, ఏపీ ఫైనాన్స్ అర్బన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ రామాంజనేయులు, దేవేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించండి

కర్నూలు (టౌన్): నగరపాలకకు సకాలంలో పన్నులు చెల్లించాలని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్.జి.వి. క్రిష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెలవు రోజు సైతం పన్ను వసూలు కేంద్రాలు పనిచేస్తాయని, ప్రజలు తమ ఆస్తి, నీటి పన్ను బకాయిలు చెల్లించాలని కోరారు.

అందరికీ భగవద్గీత పుస్తక ప్రసాదం

కర్నూలు కల్చరల్ : భగవద్గీత పుస్తక ప్రసాదం ప్రతి విద్యార్థికి అందేలా పాఠశాల, కళాశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు చూడాలని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రతి విద్యార్థికి ఉచితంగా అందించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానములు రెండు లక్షల పుస్తకాలు జిల్లాకు అందించినట్లు తెలిపారు. ఈ 30 పేజీల పుస్తకంలో మానవ జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే ఎదురయ్యే సవాళ్లను ఎలా అధిగమించాలో తెలుపుతుందని పేర్కొన్నారు. పరిపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 9059802265, 9441008677 నెంబర్లను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు



తహసీల్దార్ శ్రీనివాసరెడ్డికి సమస్యలు వివరిస్తున్న రేమడూరు రైతులు



గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఆంజనేయులు

కల్లూరు: భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఆంజనేయులు అన్నారు. శనివారం రేమడూరు గ్రామంలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. మొత్తం 45 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ తెలియజేశారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాసులు, రెవెన్యూ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సి.బెళగల్: మండల పరిధిలోని ఎం సోమాపురం (తిమ్మందొడ్డి) గ్రామంలో శనివారం తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పదిమంది రైతులు భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, వీఆర్వోలు శ్రీనివాసులు, శేఖర్, సాయిరమణ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు రూరల్ : మండల పరిధిలోని నూతనపల్లె గ్రామంలో శనివారం తహసీల్దార్ టీవీ రమేష్ బాబు గ్రామ సభ నిర్వహించారు. భూ సమస్యలకు సంబంధించి 59 దరఖాస్తూలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు.

హైటెన్షన్ లైన్ పనులు ఆపండి



తహసీల్దార్‌కు సమస్యలను వివరిస్తున్న కౌలూరు గ్రామ రైతులు

పాణ్యం: మండలంలోని కౌలురులో చేపడుతున్న పవర్‌గ్రీడ్ హై టెన్షన్ విద్యుత్ వైర్ల పనులు ఆపాలని ఆ గ్రామ రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డిని రైతులు కలిసి సమస్యను విన్నవించారు. ప్రస్తుతం పంటలు సాగులో ఉన్నాయని, వారు ఏర్పాటు చేసే పొలాల్లో రైతులకు పరిహారం ఇవ్వకుండా పనులు ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్‌కు అందించిన వినతి మేరకు ఈ పనులు ఆపాలన్నారు. స్పందించిన తహసీల్దార్ పవర్‌గ్రీడ్ అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

'పల్లె పండుగల' కు స్పందన కరువు



కొండాపురంలో పల్లె పండుగ కార్యక్రమంలో ప్రజలు లేని దృశ్యం

సి.బెళగల్: టీడీపీ కూటమి ప్రభుత్వం ఈనెల 14వ తేదీ నుంచి గ్రామాల్లో చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన పూర్తిగా కరువైంది. శనివారం సి.బెళగల్ మండలంలోని గుండ్రేవుల, కొండాపురం, ఈరల్దిన్నె గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమాలు నిర్వహించగా ప్రజలు ఏమాత్రం ఆసక్తి చూపలేదు. గుండ్రేవులలో ఉదయం 10.30 గంటలకు కార్యక్రమాన్ని అధికారులు ప్రారంభించినా ప్రజలు ఎవ్వరూ రాకపోవడంతో అరగంటలో ముగించేశారు. అదేవిధంగా కొండాపురంలో 11 గంటలకు అధికారులు కార్యక్రమాన్ని ప్రారంభించగా ప్రజా స్పందన లేదు. చివరకు 11:20 గంటలకు కేవలం నలుగురితోనే మమా అనిపించారు. ఆయా గ్రామాల్లో సచివాలయ ఉద్యోగులతో మాత్రమే పల్లె పండుగ కార్యక్రమాన్ని ఉపాధి హామీ సిబ్బంది నిర్వహిస్తున్నారు. ఎంపీడీఓతో పాటు, ఆయా శాఖల మండల అధికారులు హాజరుకావాల్సి ఉన్నప్పటికి, మండల స్థాయిలో కేవలం ఉపాధిహామి ఏపీఓ రామన్న, జేఈ రంగస్వామిలు మాత్రమే హాజరవుతున్నారు.

22 నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు

పాణ్యం: మండలంలో ఈ నెల 22వ తేదీ నుంచి నాలుగురోజులపాటు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఆధార్‌లో మార్పులు చేర్పులు, కొత్త ఆధార్ తదితర సేవలు అందజేస్తామన్నారు. 22వ తేదీన కొడజూటూరు, ఎస్ కొత్తూరు గ్రామాల్లో, 23న గోరుకల్లు, భూపనపాడు, 24న గోనవరం, కౌలూరు, 25వ తేదీన కొణిదేడు, నెరవాడ గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలు నిర్వహిస్తామన్నారు. ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్న విషయాన్ని ప్రజలకు చేరవేయాలని, దండోరా వేయించాలని ఎంపీడీఓ సిబ్బందికి సూచించారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు గడువు పెంపు

పాణ్యం: ఓపెన్ స్కూల్, ఇంటర్ ప్రవేశాలకు గడువు పెంచినట్లు ఎంఈఓ–2 సుబ్రహ్మణ్యం శనివారం తెలిపారు. ఫీజు చెల్లింపునకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఈనెల 25తేదీ వరకు గడువు ఉందన్నారు. ఈనెల 31వ తేదీ వరకు రూ. 500 అపరాధ రుసుంతో ఫీజు చెల్లించవచ్చన్నారు.

టెట్‌కు 82 మంది గైర్హాజరు

పాణ్యం: మండల పరిధిలోని ఆర్‌జీఎంలో శనివారం నిర్వహించిన టెట్‌కు 82మంది గైర్హాజరయ్యారని ఎంఈఓ –2 సుబ్రహ్మణ్యం తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షకు 280మంది గాను 47మంది గైర్హాజరైనట్లు తెలిపారు. అలాగే మధ్యాహ్నం జరిగిన ఈ పరీక్షకు 280మందికి గాను 35మంది గైర్హాజరయ్యారని ఎంఈఓ వివరించారు.

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయండి

కర్నూలు (లీగల్) : ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాజధాని అయిన కర్నూలులో రాష్ట్ర హైకోర్టు బెంచ్ త్వరితగతిన ఏర్పాటు చేయాలని కర్నూలుకు చెందిన న్యాయవాది, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు పి.రవిగువేరా సీఎం చంద్రబాబు నాయుడును కోరారు. శనివారం రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులంతా సీఎంను కలసి వరద బాధితుల సహాయంగా రూ.10 లక్షలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా కర్నూలుకు హైకోర్టు బెంచ్ ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ త్వరితగతిన అందుకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభించాలని కోరారు.